క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ భగవతి గూడ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు రగడంపల్లి శ్రవణ్, మజ్జిగ నరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లు శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు వివరించారు. వీధి దీపాలు వెలగడం లేదన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు.

ముగిసిన చిత్రలేఖనం పోటీలు


గీసిన చిత్రాన్ని చూపుతున్న కళాకారులు

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు కొనసాగిన చిత్రలేఖనం పోటీలు బుధవారం ముగిశాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో కాశీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో శివోహం 9 పేరిట పోటీలను నిర్వహించారు. అందులో 25 మంది కళాకారులు పాల్గొని ఆ మహాశివుడి చిత్రాలను గీశారు. చివరి రోజు వారు గీసిన చిత్రాలను ప్రదర్శనగా ఉంచి కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు రాం ప్రతాప్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్, నాయకులు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాటం అభినందనీయం


మందకృష్ణ మాదిగతో మాట్లాడుతున్న పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నరేందర్

శంషాబాద్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగను బుధవారం ఆయన కార్యాలయంలో పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ కలిశారు. ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ పోరాటం అభినందనీయమని ఆయన అన్నారు. పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేత మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి-భ్రమరాంబమాత కల్యాణం

రాయదుర్గం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గం మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లికార్జునస్వామి-భ్రమరాంబ తల్లి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని దర్శనానికి అవకాశం కల్పిస్తారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలి



గచ్చిబౌలి: ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్ అన్నారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మసీద్‌బండలోని ప్రభుత్వ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపీ సేవా కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, వసంత్‌యాదవ్, రామరాజు, వెంకటస్వామిరెడ్డి, మహేశ్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, రాజేష్‌గౌడ్, లక్ష్మణ్, వంశీ పాల్గొన్నారు.


క్యూ లైన్‌లో ఉన్న భక్తులు


మంచిరేవుల మచిలేశ్వరాలయం వద్ద దర్శనానికి బారులు తీరిన భక్తులు


శివరాత్రి సందర్భంగా భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు


మచిలేశ్వరస్వామి అభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దంపతులు

హర హర మహాదేవ..
శంభో శంకర

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు | తెల్లవారు జామునుంచే అభిషేకాలు | రోజంతా దర్శనాలు


పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు


చిన్న అనంతగిరి శివాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

నియోజకవర్గ పరిధిలోని శివాలయాలు హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివనామ స్మరణతో బుధవారం మారుమ్రోగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు పోటెత్తారు. ఆలయాలను వివిధ రంగురంగుల విద్యుత్ దీపాలతో పాటు పూలతో అందంగా అలంకరించారు. శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంచిరేవుల మచిలేశ్వరస్వామిని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ దంపతులు, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ దంపతులు, ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేష్‌ముదిరాజ్ తదితరులు పూజలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్‌గూడ, బుద్వేల్, మంచిరేవుల, పుప్పాలగూడ, మణికొండ, నార్సింగ్, బండ్లగూడ, హైదర్‌షాకోట్, కిస్మత్‌పూర్, మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానగర్, కాటేదాన్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– రాజేంద్రనగర్ జోన్‌బృందం


మచిలేశ్వరస్వామిని దర్శించుకున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్


ఆదర్శ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ పూజలో మానవసేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ కుమారస్వామి


మణికొండలో పార్వతీరామలింగేశ్వరున్ని దర్శించుకుంటున్న భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న మణికొండ శివాలయం



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ ఏ.మల్లేష్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాక్ చర్చి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు శ్రీసాయి కాలనీ, ప్రభుత్వ స్కూల్, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్‌ఆర్‌ఐ టౌన్‌షిప్, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్‌ఎం ఎన్‌క్లేవ్ 1, 2, స్పెషల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చి, కీర్తి విల్లాస్, కిస్మత్‌పూర్ ఫీడర్ పరిధిలో కిస్మత్‌పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, శివసాయి కాలనీ, బాబమ్మ కాలనీ, మైత్రి కాలనీ, వినాయక్‌నగర్, మారుతీ కాలనీ, ఎస్సీ బస్తీ, శ్రీ కృష్ణ కాలనీ, విల్లా గ్రీన్, అద్యా విల్లాస్, గృహషిపి, గిరిధారి అపార్ట్‌మెంట్, హనుమాన్ దేవాలయం, బండ్లగూడ ఫీడర్ పరిధిలో 4 నుంచి 5 గంటల వరకు ఆరెమైసమ్మ మెయిన్ రోడ్డు, కాళికానగర్, ఎన్‌ఎఫ్‌సీ కాలనీ, మల్లికార్జుననగర్, ఆదర్శనగర్ రోడ్డు 1, 5, న్యూ కేర్ ఆసుపత్రి, గాయత్రీనగర్, వికాస్‌నగర్, ద్వారకానగర్, యాదవమిత్ర కాలనీ, శ్రీ షిరిడీ సాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రతి రోజు వీధులను శుభ్రం చేయాలి : కమిషనర్


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను సిబ్బంది క్రమం తప్పకుండా నిర్వహించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్‌లో దుర్గాఖలీజ్‌ఖాన్ చౌరస్తా, 20వ డివిజన్‌లో కాళీ మందిర్ జంక్షన్, 15వ డివిజన్‌లోని వినాయక టెంపుల్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారిపై ఉన్న చెత్తను తప్పకుండా ఊడ్చాలన్నారు. మెయిన్ రోడ్లు పూర్తి చేసిన తరువాత బస్తీలు, కాలనీల్లోని రోడ్లను శుభ్రం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మీర్జా తాఫిక్, వెంకటేష్, నరేందర్ తదితరులున్నారు.

భక్తులకు పండ్లు పంపిణీ చేసిన ముస్లింలు

రాజేంద్రనగర్: మహా శివరాత్రి సందర్భంగా రాజేంద్రనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ముస్లింలు బుధవారం భక్తులకు పండ్లను అందజేశారు. అందరం కలిసి మెలసి పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్రీ లలిత్, నయీం, మహ్మద్ గౌస్ అలీ, మహ్మద్ ఉమర్, మహ్మద్ అన్వర్, అఫ్రోజ్, అమిత్, ఆయాన్, శ్రీకాంత్, రాజు, రవి, రాజు, శిరీష్, మనోహర్, సందీప్ పాల్గొన్నారు.

సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సనాతన సేవా సమితి ఏర్పాటు చేసిన పండ్ల పంపిణీకి ముఖ్య అతిథిగా మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ హాజరయ్యారు.


పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్



గోవులు తరలిస్తున్నారని అడ్డగింత

శంషాబాద్ : అక్రమంగా గోవులను తరలిస్తున్నారనే విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చందానగర్ వైపు నుంచి ఓ వాహనాన్ని గో సంరక్షణకు సంబంధించిన వ్యక్తులు వెంబడించారు. సాతంరాయి వద్ద వాహనాన్ని ఆపి గొడవకు దిగారు. వాహనంలో ఉన్న వ్యక్తులు మరికొందరిని అక్కడికి రప్పించుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. గొడవకు దిగిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

- 6 ఎంఎల్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి
- మరికొన్ని రోజుల్లోనే అందుబాటులోకి..
- పూర్తిస్థాయి నీటి సరఫరాకు చర్యలు


ప్రారంభానికి సిద్ధమైన బోడిగుట్ట రిజర్వాయర్

పహాడీషరీఫ్: హైదరాబాద్ మహా నగరాన్ని ఆనుకొని ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. మిషన్ భగీరథ ఫేజ్-1 కింద కొన్ని వాటర్ ట్యాంక్‌లు నిర్మించినప్పటికీ లక్షకు పైగా ఉన్న జనాభాకు సరిపడా పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఫేజ్-2 కింద రూ.113 కోట్ల వ్యయంతో మూడేళ్ల క్రితం ప్రారంభమైన భారీ రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఇప్పటికే పహాడీషరీఫ్‌లో 30 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ ప్రారంభం కాగా.. తాజాగా రూ.7.40 కోట్ల వ్యయంతో కొత్తపేట బోడిగుట్టపై నిర్మించిన 60 లక్షల లీటర్ల(ఆరు మిలియన్ లీటర్లు) సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌ను మరికొన్ని రోజుల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జలమండలి అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో రిజర్వాయర్‌కు గ్రౌటింగ్ (నీటి లీకేజీల పరీక్ష) చేయనున్నారు. రిజర్వాయర్‌ను స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి ఇటీవల జలమండలి డిప్యూటీ జీఎం శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా..

జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రస్తుతం మూడు రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతుంది. వేసవి ప్రారంభం కావడంతో ముందు నీటి సమస్య జఠిలమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో బోడిగుట్ట రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు చేపట్టారు. వేసవి అయినప్పటికీ కూడా హైదరాబాద్ మాదిరిగానే రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. కాగా ఈ ము న్సిపాలిటీ పరిధిలో కొన్ని అక్రమ కనెక్షన్లు ఉండడంతో డిమాండ్‌కు తగ్గ నీటిని సరఫరా చేసేందుకు అధికారులకు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఈ మున్సిపాలిటీలో రోజుకు 9.5 మిలియన్ లీటర్ల నీటి సరఫరా అవసరం ఉంది.

రూ.113 కోట్ల వ్యయంతో.

మిషన్ భగీరథ ఫేజ్-2 కింద రూ.113 కోట్ల వ్యయంతో మొదలుపెట్టిన రిజర్వాయర్ల నిర్మాణం, 160 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ల పనులు పూర్తయ్యాయి. అంతకుముందు ఫేజ్-1 కింద జల్‌పల్లి, శ్రీరాం కాలనీలలో 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంక్‌లు, వాదే ముస్తఫాలో 20 లక్షల లీటర్ల రిజర్వాయర్, బిస్మిల్లా కాలనీలో 3 లక్షల ట్యాంక్, ఎర్రకుంటలో 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌ల నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. ఈ ట్యాంక్‌ల నిర్మాణం జరగక ముందు 2015-2016 సమయంలో షాహిన్‌నగర్ పరిసరాల ప్రజలు రెండు పర్యాయాలు శ్రీశైలం జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేసిన సందర్భాలున్నాయి.


గుట్టపైకి వేసిన భారీ పైప్‌లైన్లు

మాజీ సీఎం కేసీఆర్ చొరవతోనే..



జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపారు. మొత్తం రూ.113కోట్ల వ్యయంతో రిజర్వాయర్లు, పైప్‌లైన్లు నిర్మించాం. రూ.7.40కోట్ల వ్యయంతో బోడిగుట్టపై నిర్మించిన రిజర్వాయర్ త్వరలోనే అందుబాటులోకి రానుండడంతో పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుంది. నిర్మాణానికి నిబద్ధతతో పనిచేసిన జలమండలి అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నా. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు రూ.313 కోట్ల నిధులు రాబట్టి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నాం.

– పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే, మహేశ్వరం